సాక్షి తిరుపతి
మంగళవారం । 20 । మే । 2025



ఉద్యానం.. అధ్వాన్నం!
జిల్లాలో ఉద్యాన పంటలు అధ్వాన్నంగా మారాయి. దిగుబడి లేక.. గిట్టు బాటు ధర రాక రైతును నట్టేట ముంచేస్తున్నాయి. - 8లో



అమ్మను రాయితో కొట్టి చంపేశాడు!
'అమ్మను రాయితో కొట్టి చంపేశాడు' అంటూ ఆ చిన్నారి తన తల్లి మరణించిన తీరును వివరించడం కలచి వేసింది. - 8లో



అర్జీదారుల కోసం ఎదురు చూపు!
కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల కోసం అధికారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. - 8లో

• బారులు తీరిన భక్తజనం



ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు ప్రారంభమయ్యాయి. మిట్ట మధ్యాహ్నం 12 గంటలకు సైతం పొంగమంచు తెరలు కనువిందు చేశాయి. దీనికితోడు తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులు బారులు తీరడంతో అలిపిరి మార్గం కిక్కిరిసింది. ఈ దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది. – మోహన్‌కృష్ణ కేతారి, సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

• తీరని నష్టం



తిరుపతి జిల్లాలో ఆదివారం రాత్రి కురిసిన గాలీవానతో అన్నదాతను కంటిమీద కునుకులేకుండా చేసింది. మిరప, మామిడి రైతులకు అపార నష్టం మిగిల్చింది. సత్యవేడు నియోజకవర్గం, బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోనే 180 ఎకరాల్లో మామిడి నేలరాలగా.. 12 ఎకరాల్లో మిరప పంట దెబ్బతింది. తడిచిన మిరపకాయలను ఆరబెట్టుకోవడానికి అగచాట్లు పడాల్సి వచ్చింది. రాలిన మామిడిని ఒకటికి సగానికి మార్కెట్‌కు తరలించాల్సి పరిస్థితి నెలకొంది. – బుచ్చినాయుడుకండ్రిగ

• అల్లకల్లోలం



ఉత్తర కోస్తాంధ్ర బంగాళాఖాతం సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, దక్షిణ కోస్తా నుంచి యానం వరకు కొనసాగుతున్న ద్రోణి కారణంగా గత రెండు రోజులుగా వాతావరణంలో భిన్న మార్పులు కనిపిస్తున్నాయి. సోమవారం వాతావరణం చల్లబడింది. ఓ మోస్తారు వర్షం పడింది. తూపిలిపాళెం సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. సముద్రం 6 మీటర్లు ముందు వచ్చింది. – వాకాడు

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 67 వినతులు



ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 67 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

పది సప్లిమెంటరీకి 466 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం తెలుగు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 1,647 మంది హాజరుకావాల్సి ఉండగా వారిలో 466 మంది గైర్హాజరవ్వడంతో 1,181 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈఓ కేవీఎస్.కుమార్ తెలిపారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలో భాగంగా నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 167 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా.. వారిలో 25 మంది గైర్హాజరవ్వడంతో 142 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈఓ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఎస్‌పీకేఎం ఐఐహెచ్‌టీ (శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ)లో డిప్లొమా కోర్సులు చేయడానికి ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఓఎస్‌డీ ఎస్. గిరిధర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల డిహెచ్‌టీటీ కోర్సుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కోర్సులో మొత్తం 53 సీట్లు ఉన్నాయని, తమిళనాడులోని సేలం 12, కర్ణాటకలోని గడక్‌లో 4 సీట్లుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పదోవ తరగతి ఉత్తీర్ణులైన వారు మెరిట్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. లేదా ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, ఒకేషనల్ (టెక్స్‌టైల్స్, ఐటీఐ రెండేళ్ల) కోర్సులు పూర్తిచేసుకున్న వారు నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందచ్చని తెలిపారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్ సెలెక్షన్స్ ద్వారా చేనేత, జౌళిశాఖలకు సంబంధించి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఆసక్తిగల వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఐఐహెచ్‌టీవీజీఆర్.కమ్, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించొచ్చని సూచించారు.

మృత్యుంజయుడికి విశేష పూజలు



విశేష అలంకరణలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్లం, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

అన్నదాత దుఃఖీభవ!

కూటమి ప్రభుత్వంలో రైతులు నట్టేట మునిగిపోయారు. చేతిలో చిల్లిగవ్వలేక.. పెట్టుబడి సాయం అందక అప్పుల పాలవుతున్నారు. ఎన్నికల సందర్భంగా అలవిగాని హామీలు గుప్పించిన కూటమి నాయకులు వాటిని అమలు చేయకపోవడంతో గందరగోళానికి లోనవుతున్నారు. ప్రతి పంటకూ అప్పులు చేసి.. వడ్డీలు కడుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ ఖరీఫ్‌లోనైనా అన్నదాత సుఖీభవ డబ్బులు అందుతాయో లేదోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.



నారు సిద్ధం చేస్తున్న కూలీలు

- అన్నదాత సుఖీభవకు పంగనామాలు
- ఖరీఫ్ సీజన్ మొదలైనా ఇంతవరకు అందని వైనం
- సవాలక్ష ఆంక్షలతో రైతులు సతమతం
- అర్హుల జాబితాలో మళ్లీ జల్లెడ పడుతున్న యంత్రాంగం

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడో పంట సీజన్ మొదలైంది. ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ ఊసేలేదు. రైతులు వెయ్యి కళ్లతో పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కో రైతుకు రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు నిధులు విడుదల చేయకపోగా.. సర్వేల పేరుతో సవాలక్ష ఆంక్షలు విధించడంపై రైతులు మండిపడుతున్నారు. గత ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతుకూ క్రమం తప్పకుండా రైతు భరోసా అందించిందని గుర్తుచేస్తున్నారు.

అర్హులను తగ్గించే కుట్ర
ఇటీవల గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పదికి పైగా సర్వేలు చేపట్టారు. అందులో ఇన్‌కం ట్యాక్స్ కట్టేవారు.. అద్దె తీసుకునేవారు, ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నవారు, వెబ్‌ల్యాండ్‌లో పేర్లు లేనివారు, పేర్లుతోపాటు వివరాలు తప్పులు తడకగా ఉన్నవారు అంటూ వివరాలు సేకరించారు. దీని ఆధారంగా అర్హుల జాబితా నుంచి తమను తొలగిస్తారేమోనని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏదోఒక విధంగా అర్హుత జాబితాను తగ్గించడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని చర్చించుకుంటున్నారు.

పరిశీలిస్తూ..సహనాన్ని పరీక్షిస్తూ!
జిల్లాలో రైతు భరోసా కేంద్రాలు 442 ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో ఒక అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారు. 442 రైతు సేవా కేంద్రాల్లో 310 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. పలువురు అగ్రికల్చర్ అసిస్టెంట్లకు రెండు రైతు సేవా కేంద్రాల బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు వారు అన్నదాత సుఖీభవకు అర్హులు ఎవరో తేల్చడానికి జోరుగా కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 2.8 లక్షల మంది రైతులు
జిల్లాలో 2.8 లక్షల మంది రైతులు ఉన్నారు. భూములు ఉన్న ధనవంతులు లక్ష మంది దాకా ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా లక్ష మంది ధనికులు మినహా మిగిలిన 1.8 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందించింది. గత ఏడాదిగా కుటుంబాల విభజన నేపథ్యంలో భూములున్న రైతులు ప్రస్తుతం 3.2 వేల మంది ఉన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి 2.2 లక్షల మంది దాకా అర్హులు ఉన్నట్టు లెక్కలు ఉన్నాయి. అయితే ఇటీవల సచివాలయ ఉద్యోగులు చేపట్టిన సర్వేల ఆధారంగా వాటి సంఖ్యను మరింత తగ్గించనున్నట్టు చర్చసాగుతోంది. పథకం అమలయ్యే నాటికి ఎంతమంది తగ్గిపోతారో వేచి చూడాల్సిందే.

గతంలో ప్రతి రైతుకూ రూ.13,500
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా కింద ప్రతి రైతుకూ రూ.13,500 ఇచ్చేవారు. ఏడాదిలో మూడు సార్లుగా కేంద్రం రూ.6,500, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 చొప్పున మంజూరు చేసేవారు. కులం, మతం, పార్టీలు, ప్రాంతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాన్ని అమలు చేశారు.

గత ప్రభుత్వంలో రైతు భరోసా లబ్ధి ఇలా..

సంవత్సరం	రైతులు	నగదు (రూ.కోట్లలో)
2019-20	1,55,207	119.97
2020-21	1,79,030	134.81
2021-22	1,81,7100	136.55
2022-23	1,76,435	134.73
2023-24	1,80,763	137.01

పరిశీలిస్తున్నాం



అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు ఎవరు.. అనర్హులు ఎవరు..? అనే అంశాలపై జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు జోరుగా పరిశీలిస్తున్నారు. మరో పది రోజుల్లో పరిశీలన పూర్తి చేయనున్నారు. కుటుంబాల విభజన నేపథ్యంలో రైతుల సంఖ్య ఏటా పెరుగుతోంది. భూములన్న రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. తుది జాబితాను సిద్ధం చేస్తున్నాం. అర్హులందరికీ అందిస్తాం. –ప్రసాద్‌రావు, డీఏఓ

పెట్టుబడి సాయం లేదు



అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత పెట్టుబడి సాయం ఊసెత్త లేదు. సాగు ఖర్చులకు అప్పుల చేయాల్సి వస్తోంది. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఈ సీజన్‌కు అయినా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తారో.. లేదోమరి. –జనార్దన్‌రెడ్డి, రైతు

సీజన్‌లు ముగిసినా..!



అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లు ముగిశాయి. తాజాగా మళ్లీ ఖరీఫ్ వచ్చింది. పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ అందించాలి. –నరేంద్ర యాదవ్, రైతు

గతంలో రైతుకు ప్రాధాన్యం



ఖరీఫ్ సీజన్ మొదలైంది. జోరుగా వరినాట్లు వేస్తున్నారు. పెట్టుబడికి అవసరమైన మేరకు డబ్బులు అందక అప్పులు చేయాల్సి వస్తోంది. పేద రైతులను ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాల్సి ఉంది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా చిన్న సాయం చేసినా రైతులకు అదే పెద్ద వరంగా మారుతుంది. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతు సుభిక్షంగా.. సంతోషంగా ఉండేవాడు. – రాజశేఖర్, రైతు

గౌరవమూ లేదు.. వేతనమూ రాదు

- ఎంపీటీసీలకు రెండేళ్లుగా అందని గౌరవ వేతనాలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పక్కన పెట్టేశారు
- టీడీపీ మద్దతుదారులకే ప్రాధాన్యం
- తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని పలువురి ఆవేదన



గౌరవ వేతనాలు మంజూరు చేయాలని జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీలు (ఫైల్)

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం అధికారులోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు గౌరవంతోపాటు వేతనాలు లేకుండా పోయాయి. ఎంపీటీసీ సభ్యునికి నెలకు రూ.3వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెండు విడతల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేకపోయింది. జూన్ 30న కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతకుముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు దాదాపు రెండేళ్లకు పైగా వేతనాలు రావాల్సి ఉంది. కానీ నేటికీ తమకు రావాల్సిన వేతనాలపై దృష్టి సారించడంలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ప్రజలచేత ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఏ మాత్రం గౌరవం ఇవ్వకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేం, అభివృద్ధి పథకాల్లో టీడీపీ నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యత తమకు అధికారులు ఇవ్వడం లేదని వాపోతున్నారు.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం
కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడమే తప్ప ప్రజల సమస్యలను పరిష్కరించాలని మండల అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సైతం తమను ఆహ్వానించడం లేదని చెబుతున్నారు. నిధులు మంజూరుపైనా తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదంటున్నారు. ఇలా తమను వివక్షతకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.

జిల్లాలో ఎంపీటీసీల వివరాలు

సత్యవేడు	సూళ్లూరుపేట	గూడూరు	వెంకటగిరి	శ్రీకాళహస్తి	తిరుపతి	చంద్రగిరి
81	62	58	66	65	37	96

గౌరవ వేతనాలు మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలి. అలవెన్సులు కూడా ఇవ్వడం లేదు. గతంలో మాకు ఇస్తున్న నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రస్తుతం ఆ నిధులు మంజూరు చేయడం లేదు. గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేశారు. –కుమారి, వైస్ఎంపీపీ, నాగలాపురం మండలం

అంత అలుసెందుకో?



ప్రజాప్రతినిధులంటే కూటమి ప్రభుత్వానికి అలుసై పోయింది. ఎంపీటీసీ సభ్యులందరూ ఆర్థిక స్థోమత కలిగిన వారిలా ప్రభుత్వం పరిగణిస్తోంది. రెండేళ్లకు పైగా వేతనాలు ఇవ్వకపోతే సభలు, సమావేశాలకు ఎలా రావాలి. ప్రభుత్వం మాకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాల చెల్లింపు విషయంపై స్పందించాలి. –కస్తూరి, ఎంపీటీసీ, బత్తలవల్లం, వరదయ్యపాళెం మండలం

అప్‌లోడ్ చేశాం



ఎంపీటీసీల గౌరవ వేతనానికి సంబంధించి ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. అయితే నిధులు జమ కావాల్సి ఉంది. నిధులు జమ అయిన వెంటనే ఎంపీటీసీ సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు గౌరవ వేతనాలకు చెందిన నగదు జమవుతుంది. కార్యాలయం పరంగా వేతనాలు అప్‌లోడ్ చేయడంలో పెండింగ్ లేదు. –ప్రసాద్, ఎంపీడీఓ, వరదయ్యపాళెం మండలం

మీ కోసమే 'స్విమ్స్ సేవ'



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు త్వరితగతిన సేవలందించాలనే ఉద్దేశంతో 'స్విమ్స్ సేవ'ను ప్రారంభించినట్లు డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. రోగుల సౌకర్యార్థం స్విమ్స్‌లో విద్యానభ్యసిస్తున్న విద్యార్థులను ఒక బ్యాచ్‌కు 20 మందిని నియమించి సోమవారం నుంచి స్విమ్స్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ టీటీడీలో కొనసాగుతున్న శ్రీవారి సేవ మాదిరిగానే స్విమ్స్‌లో కూడా స్విమ్స్ సేవ ప్రారంభించాలని స్విమ్స్ ఎక్సుర్ట్ కమిటీ సూచించినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో దాదాపు 42 విభాగలకు చెందిన వైద్య సేవలకు గాను వివిధ ప్రాంతాల నుంచి రోజుకు దాదా పు 1,500 మంది రోగులు వస్తున్నారని, వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంతాల వారు కావడంతో వీరికి ఎక్కడ ఏయే వైద్య సేవలందుతున్నాయో తెలియడం లేదన్నారు. అందుకోసం వారిని స్విమ్స్ ఓపీడీ బ్లాక్, శ్రీ పద్మావతి ఏపీడీ బ్లాక్ వద్ద రోగులు ఏపీ రిజిస్ట్రేషన్, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షల కోసం ఈ సేవను ప్రారంభించినట్లు తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, కాలేజ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, చీఫ్ మెడికల్ రికార్డ్స్ ఆఫీసర్ వివేకానంద్, మురళి, శిరీషా పాల్గొన్నారు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,571 మంది స్వామివారిని దర్శించుకోగా 33,372 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తుల కు 12 గంటల్లో దర్శ నం లభిస్తోంది. హుండీ కానుకలు రూ.3.49 కోట్లు సమర్పించారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు జిల్లా వ్యాప్తంగా తిరుపతిలో 5, పుత్తూరులో 2, గూడూరులో 4, మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. రెండు సెషన్స్‌లో కలిపి 2,458 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 181 మంది గైర్హాజరవ్వడంతో 2,277 (92.64 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఐఐటీలో కార్యశిబిరం ప్రారంభం



హాజరైన పీహెచ్‌డీ విద్యార్థులు

ఏర్పేడు: పరిశోధన పద్ధతులు– మల్టీ వేరియేట్ డేటా విశ్లేషణపై సోమవారం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఐదు రోజుల పాటు జరగనున్న కార్యశిబిరం అట్టహాసంగా ప్రారంభమైంది. ఐఐటీలోని హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ బహినిపతి సారథ్యంలో డీన్ ప్రొఫెసర్ ముత్తుకుమార్ పళనిస్వామి పరిశోధన పద్ధతులపై ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా పీహెచ్‌డీ పరిశోధన విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు యాభై మంది హాజరయ్యారు. ఇంజినీరింగ్, నిర్వహణ, లైఫ్ సైన్సెస్, హ్యూమానిటీస్‌తో సహా విభిన్న నేపథ్యాలకు చెందిన వారు హాజరు కావటంతో వారికి వివిధ సెషన్లలో విభాగ అధ్యాపక సభ్యులు డాక్టర్ వనీత్ కశ్యప్, డాక్టర్ విష్ణు, సీ.రాజన్ పరిశోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. కాగా ఈ నెల 23వ తేదీ వరకు ఈ వర్క్‌షాపు జరగనుంది.

ఒత్తిడి చేయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: 'మ్యాంగో పల్ప్(జ్యూస్) ప్రాసెసింగ్ సంస్థల వద్ద పెద్ద మొత్తంలో నిల్వలు ఉన్నాయి. వాటిని విక్రయించడానికి సమయం పడుతుంది. అప్పుడు వరకు వడ్డీలు కట్టలేరు. బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేయొద్దు' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సోమవారం ఉద్యానశాఖ, బ్యాంక్ అధికారులతో వర్చువల్ పద్ధతిలో సమీక్షించారు. ఇటీవల మామిడి ఫ్యాక్టరీ యజమానుల పల్ప్ పెద్ద మొత్తంలో స్టాక్ ఉన్నట్లు వెల్లడించిన అంశాలను గుర్తుచేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకుపోయానని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు బ్యాంక్ అధికారులు ఆరు నెలలు తర్వాత ఫ్యాక్టరీ యజమానులు వడ్డీలు చెల్లించడానికి అంగీకరం తెలపాలని సూచించారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

మృతుడు తిరుపతి వాసి

చిత్తూరు అర్బన్: చిత్తూరులో గత శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అతడు తిరుపతికి చెందిన మహాలింగం (63) అని తేలింది. అతు చిత్తూరులో రోడ్డు దాటుతుండగా ఓ స్కూటరిస్టు ఢీ కొన్నాడు. చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహాలింగం మృతి చెందాడు. తొలుత ఇతని వివరాలు తెలియలేదు. పోలీసుల విచారణలో మృతుడు తిరుపతిలోని శ్రీనివాస నగర్‌కు చెందిన వాడని గుర్తించారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యానం.. అధ్వాన్నం!



ఈ ఫొటోలోని రైతు పేరు కుంచం సుబ్బయ్య. ఊరు సైదాపురం. గ్రామంలో ఐదెకరాల వరకు కౌలుకు తీసుకుని ప్రతి ఏటా వ్యవసాయం చేస్తున్నాడు. అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నాడు. ఈ ఐదెకరాల్లో ఈ ఏడాది 20 పుట్ల ధాన్యాన్ని పండించాడు. సరైన గిట్టుబాటు ధరలేక.. ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి గిడ్డంగి సౌకర్యం లేక రోడ్డుపైనే పోసి నిరీక్షించాడు. చివరకు విధిలేని పరిస్థితుల్లో పుట్టి రూ.17 వేలకు తెగనమ్ముకున్నాడు. అదే పుట్టి గత ఏడాది రూ.24 వేల వరకు విక్రయించినట్టు పేర్కొంటున్నాడు. ఈ యేడు పెట్టుబడి ఎక్కువ.. గిట్టుబాటు తక్కువని లబోదిబోమంటున్నాడు.



ఈ ఫొటోలోని రైతు పేరు వరప్రసాద్‌రాజు, సైదాపురం మండలం, లింగసముద్రం గ్రామం. పదెకరాల్లో సుమారు 1,100 నిమ్మచెట్లు సాగు చేశాడు. ప్రతి ఏటా రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు గిట్టుబాటయ్యేది. కానీ ఈ యేడు కనీసం పెట్టుబడి కూడా రాలేదని వాపోతున్నాడు. సీజన్‌లోనూ నిమ్మకాలు అడిగే నాథుడే లేకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం పెట్టబడి సాయం అందించి ఉంటే కొంతవరకైనా అప్పులు తీరేవని చెబుతున్నాడు.


.. జిల్లాలో ఈ ఇద్దరి రైతుల పరిస్థితే కాదు.. ప్రతి రైతుదీ ఇదే దుస్థితి. సరైన దిగుబడి లేక.. పెట్టిన పెట్టుబడి చేతికందక.. ప్రభుత్వం ఆదుకోక అప్పుల పాలవ్వాల్సి వచ్చింది.

- గిట్టుబాటు ధరల్లేక అప్పుల పాలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- పట్టించుకోని కూటమి నేతలు

సైదాపురం: తిరుపతి జిల్లాలో ఉద్యానపంటలు సుమారు 30 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటిలో మామిడి 24 హెక్టార్లు, నిమ్మ 4 వేల హెక్టార్లు, రెండు వేల హెక్టార్లలో అరటి, పూలు, జామ తదితర పంటలు సాగుచేస్తున్నారు. అలాగే వరి దాదాపు లక్ష ఎకరాల్లో సాగైంది. ప్రధానంగా నిమ్మ, మామిడి రైతుకు ఈ ఏడాది నష్టాలు తప్పలేదు. వేసవిలోనూ కిలో నిమ్మ కాయలు రూ.50 నుంచి రూ.70 లోపే పలకాయి. అదే కిలో నిమ్మకాయలు గత ఏడాది రూ.150కి పైగా పలికాయి. మిరప, టమాట, చీనీ, అరటి రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.



నిమ్మకాయలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



రోడ్డు మీదే పోసిన వరి ధాన్యం

అన్నదాత సుఖీభవ ఏదీ?



"గత ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసింది. ఈ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తవుతున్నా నేటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం లభించ లేదు. కనీసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదు. గత ప్రభుత్వం రైతు భరోసా అందించి ఆదుకుంది. ఈ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పుడిస్తుందో తెలియడం లేదు.

– శ్రీనివాసులురాజు, రైతు

అర్జీదారుల కోసం ఎదురు చూపు!

తిరుపతి అర్బన్: అర్జీదారుల కోసం అధికారులు నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీదారులు లేక కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. మొత్తం 257 వినతులు రాగా అందులో 155 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతోపాటు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి, రోస్‌మాండ్ తదితరులు అర్జీలు స్వీకరించారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నేడు టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల : తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరగనుంది. చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి బోర్డు సభ్యులు హాజరై టీటీడీ పరిధిలో భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, సౌకర్యాల కల్పనపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. దాదాపు 38 అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. తిరుమలలో బయో డిగ్రేడబుల్ వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తీసుకురావాలని చర్చించనున్నట్టు సమాచారం. అయితే వీటిని శ్రీశైలంలో అక్కడి అటవీశాఖ అనుమతించ లేదు. దీనిపై మరింత లోతుగా చర్చించనున్నారు.

ఉపాధ్యాయ బదిలీ నిబంధనలు సవరించాలి

- రేపు చిత్తూరు డీఈఓ కార్యాలయం ముట్టడి
- జయప్రదం చేయాలని పిలుపు
- ఒక్కటైన ఉపాధ్యాయ సంఘాల జేఏసీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి చేసిన చట్టంలోని అసంబద్ధ నియమాలు, పాఠశాల పునర్వ్యవస్థకు సంబంధించిన వాటిని తక్షణమే సవరించాలంటూ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతిలోని యూటీఎఫ్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో కూటమి ప్రభుత్వ తీరుపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ముత్యాలరెడ్డి, జగన్నాథం, సాంబిరెడ్డి మాట్లాడుతూ 117జీఓను రద్దు చేయాలంటూ ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. పైగా 117జీఓ రద్దు పేరుతో గతంలో ఆరు రకాలుగా ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. పాఠశాల స్థాయిలో ఉన్న భౌతిక, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలలను పునర్వ్యవస్థీకరించడం, తద్వారా పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా వచ్చాయని విమర్శించారు. దీంతో పాటుగా 3, 4, 5 తరగతులను మోడల్ స్కూల్ పేరుతో తరలించడం వల్ల అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోవడంతో పాటు చిన్న పిల్లలు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్లడం భారంగా ఉంటుందన్నారు. ఏకపక్షంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇలాంటి అసంబద్ధ నిర్ణయాలతో ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పాలవుతున్నారని విమర్శించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న చేపట్టే చిత్తూరు డీఈఓ కార్యాలయ ముట్టడిని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. జేఏసీ నాయకులు సురేష్, దండు రామచంద్రయ్య, బండి మధుసూదనరెడ్డి, వయ్యాల మధు, సుభాష్ చంద్రదాస్, వెంకటరమణ, రెడ్డిశేఖర్, మోహన్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.



ముట్టడిని జయప్రదం చేయాలంటూ పిలుపునిస్తున్న ఉపాధ్యాయ సంఘాల జేఏసీ

'బాలుడి వెట్టి'పై కేసు నమోదు

సత్యవేడు: ఓ బాలుడిని నిర్బంధించి వెట్టిచాకిరీ చేయించడంపై మంగళవారం సత్యవేడులో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ వివరాలు మేరకు... గూడూరు మండలం, నెలటూరు సమీపాన చవటపాళెంలో అంకమ్మ కుటుంబం ఉంటోంది. వారు బాతుల సంరక్షణకు దళవాయి అగ్రహారానికి చెందిన ముత్తు, ధనభాగ్యం ఇద్దరూ అంకమ్మతో పాటు వారి కుటుంబ సభ్యులను రెండేళ్ల క్రిత రప్పించుకున్నారు. అంకమ్మతో రెండో భర్త ప్రకాష్ కూడా ఇక్కడకు వచ్చాడు. ఏడాది తర్వాత అంకమ్మ మొదటి భర్త చనిపోవడంతో దహన సంస్కారాల కోసం సొంత ఊరు చవటపాళెంకు వెళ్లింది. ఆ సమయంలో బాతులు మేపడానికి ఇచ్చిన అడ్వాన్సును ఇచ్చి వెళ్లాలని ముత్తు నిలదీశాడు. దీంతో తన అబ్బాయి వెంకటేశ్‌ను దళవాయి అగ్రహారంలోనే వదలి వెళ్లామని, అడ్వాన్స్ సొమ్ము మళ్లీ తిరిగి వచ్చి ఇస్తామని అంకమ్మతో పాటు కుమార్తె రామలక్ష్మమ్మ తెలిపి సొంత ఊరికి వెళ్లారు. అప్పటి నుంచి పలు పర్యాయాలు అంకమ్మతో తన కుమారుడు ఫోన్లో తరచూ మాట్లాడే వాడు. గత నెలగా అమ్మతో కొడుకు మాట్లాడక పోవడంతో అనుమానం వచ్చి సత్యవేడుకు వచ్చి తన కుమారుడు ఎక్కడ అంటూ వారిని నిలదీసింది. బాలుడు వెంకటేశ్ ఆచూకీ తెలియలేదని దురుసుగా సమాధానం ఇస్తూ కులం పేరుతో దూషిస్తూ నిర్లక్ష్యంగా ముత్తు సమాధానం ఇచ్చాడు. దీనిపై అంకమ్మకు అనుమానం వచ్చి సోమవారం తన కుమారుడు కనిపించడంలేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులు ముత్తు, ధనభాగ్యం, రాజశేఖర్ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు.

అమ్మను రాయితో కొట్టి చంపేశాడు!

- తల్లిని హింసించిన వైనాన్ని పోలీసులకు తెలిపిన చిన్నారి
- కన్నీరుమున్నీరైన స్థానికులు



తల్లి మృతి చెంది, తండ్రి పరారు కావడంతో అమ్మమ్మ వద్ద చేరిన ముగ్గురు చిన్నారులు

నాయుడుపేట టౌన్: 'నాన్నే అమ్మను రాయితో గుద్ది చంపేశాడు.. మా కళ్లెదుటే అమ్మ చనిపోయింది' అంటూ ఆ చిన్నారి కళ్ల నిండా నీళ్లు పెట్టుకుని తన తల్లిని చంపిన వైనాన్ని పోలీసులకు వివరించిన తీరు స్థానికులను కలచివేసింది. కన్న బిడ్డల ఎదుటే అతి కిరాతకంగా భార్యను కడతేర్చిన ఘటనపై పోలీసులు సోమవారం విచారణ చేపట్టారు. వివరాలు.. మండల పరిధిలోని మడపలం గ్రామ సమీపంలో కాలువ గట్టు వద్ద శనివారం రాత్రి మద్యం మత్తులో భార్య వీణమ్మ(28)ను భర్త రాపూరు శ్రీనివాసులు హత్య చేసిన విషయం తెలిసిందే. మృతురాలి తల్లి తుపాకులు పెంచలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతురాలికి అఖిల(7), బత్తెయ్య(4), ఆదెయ్య(3) చిన్నారులున్నారు. శనివారం రాత్రి భర్త శ్రీనివాసులు పూటుగా మద్యం సేవించి భార్య వీణమ్మతో గొడవపడ్డాడు. ఆపై బండరాయితో తలపై మోది చంపేశాడు. తర్వాత పాము కాటు వేయడంతో వీణమ్మ మృతి చెందిందని నమ్మబలికాడు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి పెంచలమ్మ ఆదివారం ఉదయం బిక్కుబిక్కుమంటూ ఏడ్చుతున్న వీణమ్మ పిల్లల్ని అక్కున చేర్చుకుంది.

పోలీసుల ఔదార్యం

విచారణ అనంతరం వీణమ్మ మృతదేహానికి సోమవారం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతురాలి కుటుంబ సభ్యులు నిరుపేద గిరిజనులు కావడంతో వారికి పోలీసులు అన్ని విధాలుగా సహాయసహకారాలు అందించారు. వీణమ్మ మృతదేహాన్ని సైతం తీసుకెళ్లేందుకు వారి వద్ద నగదు లేక పోవడంతో పోలీసులే నాయుడుపేటలో వీణమ్మకు అంత్యక్రియలు జరిపించారు. పరారీలో ఉన్న ఆమె భర్త శ్రీనివాసులును త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

నా కుమారుడిది సహజ మరణం కాదు

- అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసిన తండ్రి



గణేష్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గణేష్‌కుమార్

నాయుడుపేట టౌన్: 'నా కుమారుడిది సహజ మరణం కాదు. అతని మరణంపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. నా కుమారుడు నివాసముంటున్న నివాసంలోనే అతని భార్య స్నేహితుడు కూడా ఉన్నాడు. ఈ విషయాన్ని నా కోడలు చెప్పలేదు. దీనిపై విచారణ చేపట్టండి' అంటూ శ్రీకాకుళానికి చెందిన మృతుడి తండ్రి పీ.నరసింహమూర్తి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. శీకాకుళం ప్రాంతానికి చెందిన పూతల గణేష్ కుమార్(34), అతని భార్య అమృత, వారి బాబుతో కలిసి నాయుడుపేట పట్టణంలోని మంగపతినాయుడు నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గణేష్‌కుమార్ మేనకూరు సెజ్‌లోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో గణేష్‌కుమార్ ఇంట్లో నిద్రలేచి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని స్థానిక ప్రభుత్వ వైద్య శాలకు తీసుకెళ్తుండగా గణేష్‌కుమార్ మృతి చెందినట్లుగా భార్య అమృత పేర్కొన్నారు. అయితే కోడలు అమృత చెప్పిన విషయాలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. తన కుమారుడు నివాసముంటున్న ఇంట్లో కోడలు అమృత స్నేహితుడు కూడా ఉంటున్నాడు. ఆ విషయం చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తోంది.. అని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు గణేష్‌కుమార్‌ది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బంధువులు శ్రీకాకుళం నుంచి నాయుడుపేటకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

అనధికార వ్యక్తులు తిరుమల ఖాళీ చేయాల్సిందే

తిరుమల : తిరుమల భద్రతలో భాగంగా టీటీడీ సీవీఎస్వో వీ.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో పోలీసులతోపాటు విజిలెన్స్, ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్‌శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా శ్రీవారి మెట్టు, ఆదిశేషు అతిథిగృహం, ఎంబీసీ–34 ప్రాంతంతో పాటు ఎస్ఎంసీ, ఏటీసీ పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి తిరుమలకు కూలి పనులపై వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్న వారి వివరాలను సేకరించారు. అదేవిధంగా తిరుమలలో అనధికారికంగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారి వివరాలను సేకరించి వారిని అక్కడి నుంచి పంపిచేశారు. తిరుమలలో నిర్మాణాలను పరిశీలించి ఆయా ప్రాంతాలను బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. అనంతరం తిరుమలలోని ఫొటోగ్రాఫర్స్, పండ్ల దుకాణాలు, బడ్డీ కొట్టులను పరిశీలించారు. అనధికార వ్యక్తులు వెంటనే తిరుమల ఖాళీ చేయాలని హెచ్చరించారు.



తిరుమలలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మహిళా రక్షణకు మిషన్‌శక్తి వన్ స్టాప్ సెంటర్

తిరుపతి అర్బన్: మిషన్‌శక్తి వన్‌స్టాప్ సెంటర్‌ను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళల లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, అక్రమ రవాణా, గృహ హింస, బాల్య వివాహాలు, కిడ్నాపింగ్, సైబర్ నేరాలు తదితర అంశాల నుంచి మహిళలకు రక్షణ కల్పించడానికి మిషన్ శక్తి వన్‌స్టాప్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉచిత న్యాయ రక్షణ, వైద్యం, కౌన్సెలింగ్, వసతి సాయం చేయాలని సూచించారు. ఆ మేరకు మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181పై అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ వసంత బాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీసీహెచ్‌ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. అదనపు సమాచారం కోసం 918639835953 ,9700561225, 9988853335లో సంప్రదించాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ఉపాధికల్పనాధికారి వెంకటరమణ, డీఎల్‌డీఓ నారాయణరెడ్డి, గణేష్ పాల్గొన్నారు.



వాట్సాప్ మనమిత్ర స్టాండ్స్ ఆవిష్కరణలో కలెక్టర్, జేసీ, డీఆర్వో

వాట్సాప్ మనమిత్ర సేవలు

ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన వాట్సాప్ మనమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలసి వాట్సాప్ మనమిత్రను ఆవిష్కరించారు. జిల్లా సచివాలయ అధికారి నారాయణరెడ్డి, జిల్లా కో–ఆర్డినేటర్ జగదీష్ పాల్గొన్నారు.

బీర్ బాటిల్‌తో దాడి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఆటో స్టాండులో మద్యం తాగిన వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి బీరు బాటిల్‌తో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం ఉత్తనూరు గ్రామానికి చెందిన హరికి మద్యం తాగే అలవాటు ఉంది. గత మూడు రోజులుగా తిరుపతిలో కొత్తగా పరిచయమైన వ్యక్తితో కలసి మద్యం సేవించాడు. ఈ క్రమంలో ఆదివారం హరికి పరిచయమైన వ్యక్తితో ఆదివారం మాటామాటా పెరిగి గొడవ కావడంతో హరి చేయి చేసుకున్నాడు. సోమవారం ఉదయం మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఆటో స్టాండులో ఒంటరిగా ఉన్న హరిపై సదరు గుర్తు తెలియని వ్యక్తి బీరు బాటిల్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గట్టిగా అరవడంతో దాడి చేసిన వ్యక్తి పరారవగా రక్తగాయాలతో పడి ఉన్న హరిని రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు ఆస్పత్రిలో బాధితున్ని కలసి గొడవకు గల కారణాలను తెలుసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడి ఆచూకీ కోసం సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మీకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం!

- ఎంపీ నిధులతో ఆదరంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం
- ప్రారంభించిన ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్

కేవీబీపురం: 'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా కూటమి ప్రభుత్వ ఆగడాలు మితిమీరుతున్నాయి. వీటన్నింటినీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలుస్తాం' అని ఎంపీ గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆదరం గ్రామంలో ఎంపీ నిధులు రూ.11.64 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం వారు ప్రారంభించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో స్థానిక గ్రామస్తులు తాగునీటి ఇబ్బంది గురించి ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తన నిధుల ద్వారా సమస్యను పరిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు తెలుగుగంగ నీటిని కాళంగి రిజర్వాయర్‌కు రప్పిస్తే 17వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీ నిధుల ద్వారా ఇప్పటికే నియోజకవర్గంలోని ఏడు మండలాలకు వీధిలైట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మునిలక్ష్మీ నందకుమార్, జెడ్పీటీసీ మూర్తి మునెమ్మ, మండల పార్టీ కన్వీనర్ గవర్లకృష్ణయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు ధనంజయులురెడ్డి, పార్టీ కార్యదర్శి లాల్‌బాబుయాదవ్, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు శాస్త్రిరాజు, వైస్ ఎంపీపీ శ్రీనివాసయాదవ్, నాయకులు దశరథరామిరెడ్డి, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరాశరేశ్వరుని సేవలో జైళ్లశాఖ డీజీ

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిన అతి పురాతన శైవ క్షేత్రమైన పరాశరేశ్వరుని సోమవారం రాష్ట్ర జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు ఘనంగా స్వాగతించి ప్రత్యేక దర్శనం చేయించారు. పూలమాలలు, శాలువతో సత్కరించి, వేదపండితుల ఆశీర్వచాలను అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వారు ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేశారు.



గుడిమల్లం ఆలయంలో రాష్ట్ర జైళ్లశాఖ డీజీ